క్లుప్తంగా

వినాయకుని సన్నిధిలో రాష్ట్ర మంత్రి



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న రాష్ట్ర మైనింగ్ శాఖ మంత్రి

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని సోమవారం రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు మంత్రి కుటుంబానికి ఘనస్వాగతం పలికారు. దగ్గరుండి ఆలయ సేవలు చూశారు. స్వామివారి దర్శనం కల్పించి.. పండితులు ఆశీర్వచనాలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

శ్రీధర్‌రెడ్డి సేవలు శ్లాఘనీయం



శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గుడిపాల: వైద్య ఆరోగ్య శాఖలో శ్రీధర్‌రెడ్డి సేవలు శ్లాఘనీయమని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటప్రసాద్ అన్నారు. బొమ్మసముద్రం పీహెచ్‌సీ ఫార్మసిస్ట్ శ్రీధర్‌రెడ్డి ఉద్యోగ విరమణ పురస్కరించుకుని సోమవారం ఆయన్ను సన్మానించారు. ముఖ్య అతిథిగా వెంకటప్రసాద్ మాట్లాడారు. 35 ఏళ్ల సర్వీసులో అంకిత భావంతో శ్రీధర్‌రెడ్డి పనిచేశారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని తక్కిన ఉద్యోగులు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా ఆఫీసర్ వేణుగోపాల్, డాక్టర్లు లావణ్య, రష్మిత, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారిగా రెడ్డెప్ప



ఐరాల: స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారిగా డాక్టర్ రెడ్డెప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ వైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ కల్లూరుకు బదిలీపై వెళ్లారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రెడ్డెప్ప ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా నూతన వైద్యాధికారికి వైద్య సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందిస్తామని వైద్యాధికారి రెడ్డెప్ప తెలియజేశారు.

పక్వానికి వచ్చిన కాయలే కోయాలి



హార్టికల్చర్ డీడీ మధుసూదన్ రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న రైతులు

తవణంపల్లె: మామిడి రైతులు తొందరపడకుండా పక్వానికి వచ్చిన కాయలు మాత్రమే కోసి ఫ్యాక్టరీలకు తరలించాలని హార్టికల్చర్ డీడీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో క్రషింగ్ జరుగుతున్న గుజ్జు ఫ్యాక్టరీలను సందర్శించారు. ఫ్యాక్టరీల వద్ద రైతులు తరలించిన కాయల వివరాలను సిబ్బంది తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించారు. ఆన్‌లైన్‌లో కచ్చితంగా పూర్తి వివరాలు నమోదు చేస్తేనే రైతులకు ప్రభుత్వం ఇచ్చే రాయితీ వస్తుందని, లేకపోతే నష్టపోయే ప్రమాదం ఉందని సిబ్బందికి సూచించారు. ఫ్యాక్టరీల సామర్థ్యం దృష్టిలో ఉంచుకొని రైతులు మామిడి కాయలను తరలించాలని వివరించారు. ఫ్యాక్టరీ యజమానులు సిఫారసు ఉన్న ట్రాక్టర్లను అనుమతిస్తే... టోకెన్లు ఇచ్చినా అన్‌లోడ్ చేయడంలో తీవ్రంగా జాప్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మామిడికి గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు డిమాండ్ చేశారు. హార్టికల్చర్ డీడీ వెంట ఉద్యానశాఖ ఏడీ కోటేశ్వరరావు, బంగారుపాళ్యం హెచ్‌ఓ సాగరిక, రైతులు పాల్గొన్నారు.

నయవంచన.. కూటమి పాలన

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

- ప్రభుత్వాన్ని ప్రజల్లో ఎండగడదాం
- చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపు





దివంగత సీఎం వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విజయానందరెడ్డి, కరుణాకరరెడ్డి , హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

చిత్తూరు కార్పొరేషన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజల్లో ఎండగడదామని వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు కరుణాకరరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయం ఆవరణలో విజయానందరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా భూమన మాట్లాడారు. తొలుత దివంగత సీఎం వైఎస్సార్ పటానికి నివాళి అర్పించారు. అనంతరం 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో ప్రసంగాన్ని నాయకులు తిలకించారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సరళా మేరి, రూరల్ పార్టీ అధ్యక్షుడు జయపాల్, నాయకులు, ప్రజాప్రతినిధులు సూర్యప్రతాప్‌రెడ్డి, ఆను, జనార్ధన్, గణేష్, నారాయణ, రజనీకాంత్, మధుసూదన్, చాన్‌బాషా, అన్ను, మురళీరెడ్డి, చక్రి, భాస్కర్, గిరిధర్ రెడ్డి, కృష్ణమూర్తి, అప్పాజీ, చల్లాముత్తు, దేవరాజు, అంజలిరెడ్డి, భ్యాగలక్ష్మిరెడ్డి, షర్మిల, ప్రతిమారెడ్డి, మధురెడ్డి, అల్తాఫ్, నౌషద్, సంపత్, స్టాండ్లీ తదితరులు పాల్గొన్నారు.

బాండ్లపై సంతకం పెట్టారు.. ఇప్పుడేమంటారు?



అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు ఇస్తామని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇద్దరూ సంతకం చేసి బాండ్లు ఇచ్చారు. అవేవీ నెరవేరక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ వారి పక్షాన నిలబడి ప్రతి కార్యకర్తా ప్రతిపక్ష పాత్ర సమర్థవంతంగా పోషించాలి.

\- విజయసింహారెడ్డి, ఉద్యోగుల పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కూటమిని నమ్మి మోసపోయిన మహిళలు



అన్ని వర్గాలకు పథకాలు గతంలో జగనన్న పారదర్శకంగా ఇచ్చారు. అంతకంటే ఎక్కువ పథకాలు ఇస్తామని హామీలు గుప్పించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇచ్చిన హామీల్లో వేటినీ పూర్తిగా నెరవేర్చలేదు. ఎంత మందికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇచ్చారు..? తల్లికి వందనం పూర్తి స్థాయి అందరికీ అందలేదు. ఉచిత బస్సు ఎప్పుడు రోడ్డెక్కుతుందో తెలియడం లేదు.

\- గాయత్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహిళా విభాగం

ప్రజలే బుద్ధి చెబుతారు



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కష్ట సుఖాల్లో తోడుగా ఉంటాం. రాజకీయంగా ఎదుర్కోలేక అధికార పార్టీ నాయకులు రెడ్‌బుక్ మాటున అక్రమ కేసులు పెడుతున్నారు. కూటమి పాలనపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా ఉంది. హామీలపై నమ్మకం సన్నగిల్లుతోంది. ప్రజలు ఈసారి సరైన రీతిలో బుద్ధి చెప్పడం గ్యారంటీ.

\- బాబునాయుడు, జెడ్పీటీసీ, చిత్తూరు రూరల్ మండలం

కూటమి బాండ్లను ప్రజలకు చూపిస్తాం



కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసింది. హామీల గురించి అడిగితే తాట తీస్తామంటున్నారు. చంద్రబాబు హామీలపై ప్రశ్నించే బాధ్యతను 40 శాతం ఓటుతో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ తీసుకుంది. నాలుక మందంతో కార్యక్రమాలు చేస్తే ప్రజల తరపున ఉద్యమిస్తాం.చంద్రబాబు, పవన్ మేనిఫెస్టో, బాండ్లను ప్రజలకు చూపిస్తాం.

\- జ్ఞానజగదీష్, రాష్ట్ర అధ్యక్షుడు మొదలియార్ విభాగం

అబద్ధాలే ఆయన హామీలు



అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారు. ప్రజలు, ప్రతిపక్షం నోరెత్తకుండా బెదిరింపు ధోరణితో కూటమి ప్రభుత్వం పాలన చేస్తోంది. అందుకే బాబు ష్యూరిటీ ..మోసం గ్యారెంటీ పేరుతో వైఎస్సార్‌సీపీ ప్రజల్లోకి వెళ్తోంది. వివక్ష, వేధింపులే ఏకైక అజెండాగా కూటమి పాలన సాగుతోంది.

\- హరిణిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ విభాగం

కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



ఇంటింటికీ వెళ్లి గత పాలనలో జరిగిన మేలు కరపత్రాలతో ఎన్నికల ముందు తెలియజేశాం. అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి కార్యక్రమాల ఖర్చును తెలియజేశాం. ఇప్పుడు సంవత్సరంలో ప్రజలు ఎంత నష్టపోయారనే వివరాలు వారికి నేరుగా తెలియజేయనున్నాం. పార్టీ క్యాడర్ దీనిని జయప్రదం చేయాలి.

\- ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ, గుడిపాల

హామీలు నెరవేర్చేవరకూ ప్రజా పోరాటం



అధికారం కోసం చంద్రబాబు మాయమాటలతో ప్రజలను నమ్మించారు. జూన్ 24 నుంచి హామీలన్నింటినీ నెరవేరుస్తానని ప్రకటించారు. గద్దెనెక్కి ఏడాదైనా నెరవేర్చిన పాపానపోలేదు. ఆయన ఇచ్చిన హామీలను నెరవేర్చేవరకూ వరకూ ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల తరపున పోరాడతాం.

\- లీనారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మహిళా విభాగం

దౌర్జన్యాలను ఎదుర్కోవాలి



పార్టీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నేతలు దౌర్జన్యాలు, దాడులకు పాల్పడడం పిరికిపంద చర్య. అన్యాయంగా కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటాం. టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను తిప్పికొట్టాలి.

\- ప్రకాష్, గుడిపాల మండల పార్టీ అధ్యక్షుడు

ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టరీత్యా చర్యలు

- సమ్మె చేస్తున్న ఉద్యోగులకు కమిషనర్ వార్నింగ్



ఉద్యోగ సంఘ నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో వీధి దీపాలను ఆఫ్ చేయడం, నీటి సరఫరా జరగకుండా అడ్డుకోవడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ హెచ్చరించారు. వారం రోజులుగా సమ్మె చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సోమవారం చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ సమావేశమయ్యారు. ఉద్యోగులు సమ్మె చేసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ప్రజల ప్రాథమిక అవసరాలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని ఉద్యోగులను హెచ్చరించారు. ప్రజల హక్కులకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా బాధ్యతలను సచివాలయ కార్యదర్శులకు అప్పగిస్తామని ప్రకటించారు. సమావేశంలో మునిసిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, వన్ టౌన్ సీఐ మహేశ్వర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్, కార్పొరేషన్లకు సంబంధించిన ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వాటర్‌వర్క్స్, ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. వారం రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలన్నారు. సమావేశంలో నాయకులు గోపీనాథ్, మణి, విజయగౌరి, చంద్ర, జమిలాబి, రమాదేవి, విజయకుమార్, రఘు, బాలాజీరావు, లతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం

బంగారుపాళెం: గెస్ట్ అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ బోధించడానికి పీజీ చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 2వ తేది ఉదయం 10 గంటలకు కళాశాల కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

భూ ఆక్రమణను అడ్డుకోండి



మాట్లాడుతున్న బాధితులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): తమ భూమిని కొంత మేర అక్రమంగా ఆక్రమించుకుని... ఇద్దరు వ్యక్తులు రోడ్డు వేసుకున్నారని యాదమరి మండలం కట్టకింద గ్రామానికి చెందిన రవీంద్రరెడ్డి, ఏకాంబరంరెడ్డి, శశమ్మ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ భూమి ఆనుకుని మూడు అడుగుల కాలువ ఉందన్నారు. సుబ్బారెడ్డి, గోవిందరెడ్డి ఒత్తిడితో సర్వేయర్లు కాలువను పలు మార్లు కొలిచారన్నారు. తీరా కాలువ సాకు చూపి తమ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దౌర్జన్యంగా రోడ్డు వేయించారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే.. సెటిల్‌మెంట్‌కు రమ్మన్నారన్నారు. ఆ సెటిల్‌మెంట్ వద్దని...తమ భూమి తమకు కావాలని చెప్పడంతో అధికారులు తోకముడిచారన్నారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలన్నారు. ఆక్రమణకు గురైనా తమ భూమిని ఆక్రమణదారుల నుంచి విడిపించాలని ఆయన వేడుకున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి

చిత్తూరు అర్బన్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివి మేయర్ ఎస్.అముద కొనియాడారు. చిత్తూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో నలుగురు పారిశుద్ధ్య కార్మికులు యం.గంగరాజు, పి.యశోదమ్మ, యు.సుజాత, కె.విజయమ్మ ఉద్యోగ విరమణ పొందారు. సోమవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో వారిని సన్మానించారు. మేయర్ మాట్లాడుతూ.. నగర పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కార్మికులు ప్రశాంతంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ పి.లోకేష్, ఏఐటీయూసీ నాయకులు నాగరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

పంట బీమాకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 2025–26 సంవత్సరానికి సంబంధించి పంటల బీమాకు.. ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మొత్తం ఐదు రకాల పంటలు అంటే... వరి, వేరుశనగ, రాగి, కంది, టమాట పంటలను మండలం యూనిట్‌గా ఖరీఫ్ పంటకాలానికి నోటిఫై చేయగా, నిర్ణీత గడువులోపు బీమాను చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతి పంటకు నిర్ణీత ప్రీమియం చెల్లించాలన్నారు. పంటలు నష్టపోతే టాటా జనరల్ ఇన్సూరెన్స్, ఐఎఫ్‌ఎఫ్‌సీఓ టోకియో ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

ప్రజారోగ్యానికే ప్రాధాన్యం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవ నారాయణ

తవణంపల్లె: ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. సోమవారం మండలంలోని దిగువ మోదలపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు మెరుగైన వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలు వైద్య బృందానికి సహకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చునని అన్నారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశావర్కర్లు సౌందర్య, నాగభూషణ, పుష్ప, రోగులు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సమావేశం



మండల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గుడిపాల: మండల సర్వ సభ్య సమావేశం తూతూమంత్రంగా నిర్వహించారు. వైస్ ఎంపీపీ గోపి అధ్యక్షతన సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి 12మంది ఎంపీటీసీలు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు ఎంపీటీసీలు, ఒక కో–ఆప్షన్ మెంబర్, 27 మంది సర్పంచులకు కేవలం 9మంది మాత్రమే హాజరయ్యారు. సమస్యల ప్రస్తావన పెద్దగా లేకుండా ముగించేశారు. చిత్తపారలో నీటిసమస్య సమస్య పరిష్కారానికి కెపాసిటీ మోటార్‌ను బిగించాలని కోరారు. చాలామందికి ఇంటికి సంబంధించి ఇంటి జాగాలు ఇవ్వకుండా ఉన్నారని, వారందరికీ వెంటనే ఇచ్చినట్లయితే లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్ తెలియజేశారు. పంచాయతీ రాజ్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే చేపిస్తామని పంచాతీరాజ్ ఏఈ ప్రసాద్ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శిరీష పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

బంగారుపాళెం: మండలంలోని శేషాపురం గ్రామ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం స్థానికులు గుర్తించారు. గ్రామానికి చెందిన ఓ రైతు మామిడి తోటలో గుర్తుతెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకుని పది రోజులు పైన అవుతుండడంతో మృతదేహం గుర్తుపట్టలేని విధంగా మారింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.